మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నాగోలు: కాలనీవాసులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం నాగోలు డివిజన్ పరిధిలోని ఇంద్రప్రస్తా కాలనీలో మాతృ భూమి ఉత్సవ సమితి, సిటిజన్ డెవలప్‌మెంట్ ఫోరం ఆధ్వర్యంలో కెత్రిష్ ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌లో బండ్లగూడ పరిధిలోని 23 కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలువురు కాలనీవాసులు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. ఆనంద్‌నగర్ నుంచి ఫతుల్లగూడ వైపు వెళ్లే రహదారి ఇరుకుగా ఉండటంతో ఉదయం, సాయంత్రం సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రోడ్డును విస్తరించాలని కోరారు. కాలనీల్లో స్ట్రీట్‌లైట్స్, తాగునీటి పైపులైన్లు, సీసీ కెమెరాలు, నూతన డ్రైన్స్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే పరిశీలించి పరిష్కరిస్తానన్నారు. సీనియర్ నాయకులు ఆనంతుల రాజిరెడ్డి, చెరుకు ప్రశాంత్‌గౌడ్, డివిజన్ అధ్యక్షుడు చిరంజీవి, సుర్వీ రాజుగౌడ్, సతీష్‌యాదవ్, పలు కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

హైదరాబాద్ ఎంపీ స్థానాన్ని గెలుస్తాం



నియోజకవర్గ నేతలతో డాక్టర్ మధవిలత

చంచల్‌గూడ: లోకసభ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంట్ స్థానాన్ని గెలుస్తున్నామని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేందర్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి డా. మధవిలత నివాసానికి వచ్చి మర్యాదపూర్వకంగా ఆయన కలిశారు. తన అభ్యర్థిత్వాన్ని బలపరిచి హైదరాబాద్‌ను గెలిచి మోదీకి బహుమతిగా ఇద్దామని మధవిలత కోరినట్లు పేర్కొన్నారు. వీరేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. గత 5 దశాబ్దాలుగా హైదరాబాద్ పాతబస్తీలో అభివృద్ధి కుంటుపడిందని, కులమతాలకు అతీతంగా ప్రజలు ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇచ్చి చూడాలన్నారు. యాకత్‌పురా నియోజకవర్గం నాయకులు మన్నె శ్రీనివాస్, ధీరజ్‌లాల్, అమర్‌నాథ్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రేణుక, రామాదేవి, శ్వేత, సురేష్, జమునా, సుష్మ తదితరులున్నారు.

న్యాయవాదుల సంఘం కార్యాలయం పునరుద్ధరణ



న్యాయమూర్తులతో సంఘం ప్రతినిధులు

రంగారెడ్డి కోర్టులు: రంగారెడ్డి జిల్లా కోర్టు ప్రాంగణంలో న్యాయవాదుల సంఘం కార్యాలయాన్ని పునఃప్రారంభించారు. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శశిధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి డాక్టర్ పట్టాభిరామారావు, న్యాయవాదుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు రవీందర్, పట్లోళ్ల మాధవరెడ్డి హాజరై న్యాయమూర్తులను శాలువాలతో సత్కరించారు. తెలంగాణ న్యాయవాద పరస్పర సహకార సంఘం సంచాలకులు డా.బాచిరెడ్డి శాయిరెడ్డి, సంఘం ప్రతినిధులు వినోద్‌కుమార్, సందీప్‌గౌడ్, రాంచందర్, దీప్తి నాగేందర్, అనిత, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి ఇష్టపడి చదువుకోవాలి



మహిళా దినోత్సవంలో పాల్గొన్న డాక్టర్ హరికాంత్, ప్రొఫెసర్ సుజాత

సైదాబాద్: దళిత మహిళా సంఘం, సేఫ్ ఫౌండేషన్ వారి సంయుక్తాధ్వర్యంలో సోమవారం జీహెచ్ఎస్ శంకేశ్వర్ బజార్ హైస్కూల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ హరికాంత్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ లక్ష్యం ఉండాలని, ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఇష్టపడి చదువుకోవాలన్నారు. ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి మాట్లాడుతూ.. మహిళలు ఏ రంగంల్లోనూ తక్కువ కాదని, ప్రతీ రంగంలో వారు ఉన్నత స్థాయికి చేరుకుంటూ.. సమాజంలో తమ వంతు పాత్ర పోషిస్తున్నారన్నారు. 6,7,8,9,10వ, తరగతి విద్యార్థినులకు శానిటరీ నాప్కిన్లను అందజేశారు. పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఫౌండేషన్ సభ్యులు పావని, శ్రీను, చందర్, అల్మాస్, అనూష, మీనాక్షి, రుబీనా తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ల వారీగా 'ప్రజాపాలన' సేవా కేంద్రాలు



సర్కిల్- 6 డీసీ జయంత్‌తో ఎమ్మెల్యే బాలాల

చాదర్‌ఘాట్: ప్రజాపాలన సేవా కేంద్రాలు డివిజన్లలోని కమ్యూనిటీహాల్‌లలో ఏర్పాటు చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే బాలాల అన్నారు. సోమవారం మలక్‌పేట సర్కిల్–6 కార్యాలయంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ జయంత్‌తో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా పాలన సేవా కేంద్రాలు సర్కిల్ కార్యాలయాల్లో ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి డివిజన్లలోని కమ్యూనిటీ హాల్స్‌లో సేవా కేంద్రాలు ఏర్పాటు చేసి, దరఖాస్తులను స్వీకరించాలని ఆయన డీసీని కోరారు. సానుకూలంగా స్పందించిన డీసీ గ్రేటర్ కమిషనర్‌కు ఈ విషయాన్ని తెలియజేసి అనంతరం తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బ్రాహ్మణ సంఘాల మద్దతుతో మల్కాజిగిరిలో పోటీ



బ్రాహ్మణ శంఖారావం సభలో అభివాదం చేస్తున్న వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు

శంఖారావం సభలో వైష్ణవి ప్రసాద్ వెల్లడి

నాగోలు: అన్ని వర్గాల ప్రజలకు మరింత సేవ చేసేందుకు..బ్రాహ్మణ సంఘాల మద్దతుతో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు వైష్ణవి ప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి నాగోలులోని అనంతుల అంజిరెడ్డి గార్డెన్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం బ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనం, బ్రాహ్మణ శంఖారావం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి పరిధిలోని అన్ని నియోజకవర్గాల బ్రాహ్మణ సంఘాలు వైష్ణవి ప్రసాద్‌కు మద్దతు ఇవ్వాలని తీర్మానం చేసి సంఘీభావం ప్రకటించాయి. సమావేశానికి భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ అధ్యక్షుడు దుడ్డు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన శంఖారావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైష్ణవి ప్రసాద్ మాట్లాడుతూ తాను కొన్నేళ్లుగా నగరంలో విద్య, వైద్య రంగాల్లో సేవలందిచానని తెలిపారు. ప్రజలు గెలిపిస్తే మల్కాజిగిరి ప్రజలకు సేవలందిస్తానన్నారు. తనకు మద్దతు తెలిపినందుకు బ్రాహ్మణ సంఘాల వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 మంది సభ్యులతో కమిటీ వేసి తన ఆఫీస్‌ని ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు. వివిధ బ్రాహ్మణ సంఘాల అధ్యక్షులు మంగపతి రావు, దర్శనం శర్మ, తులసి శ్రీనివాస్, టీబీఎస్ఎస్ఎస్ నాయకులు జగన్మోహన్ శర్మ, బసవరాజు శ్రీనివాస్, ఎంవీఆర్ శాస్త్రి, నందిరాజు లక్ష్మీనారాయణ, వెంట్రాప్రగడ సుబ్బారావు, వక్కలంక శ్రీనివాస్‌రావు, మునిపల్లె శ్రీనివాస్, గొల్లపూడి రాజేశ్వరరావు, సోమయాజులు, మూర్తి, కల్పవల్లి, అనురాధ, భవాని, శ్రీదేవి, వివిధ సంఘాల కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు బ్రాహ్మణులు పాల్గొన్నారు.

మురుగు.. పరుగు

రోడ్లపై ఏరులై పారుతున్న మురుగు ● దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్న ప్రజలు



పిండినారాయణరెడ్డి కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగు



డ్రైనేజీ నీరు చేరడంతో పెరిగిన గడ్డి, చెత్తాచెదారం

హస్తినాపురం: ఎల్‌బీనగర్ సర్కిల్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండినారాయణరెడ్డినగర్‌కాలనీలో గత కొంత కాలంగా రోడ్లపై డ్రైనేజీ మురుగు ఏరులై పారుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు, సంబంధిత ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

- డివిజన్ పరిధిలోని పిండినారాయణరెడ్డినగర్‌కాలనీలో డ్రైనేజీ పొంగడంతో రోడ్డు మీదకు వెళ్లాలంటేనే ముక్కు మూసుకోవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఎల్‌బీ నగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

దుర్గంధం నుంచి విముక్తి కల్పించాలి..



హస్తినాపురం డివిజన్ పరిధిలోని పిండినారాయణరెడ్డి కాలనీలోని రోడ్డుపై మురుగు ఏరులై పారుతుంది. గత కొద్ది నెలల నుంచి ఈ సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడంలేదు. దోమలు చేరి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను సత్వరమే పరిష్కరించాలి. – నీళ్ల మధుసూదన్‌గుప్తా, పిండి నారాయణరెడ్డి కాలనీ అధ్యక్షుడు

ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి..



తాము ఎదుర్కొంటున్న మురుగు సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కాలనీలోని డ్రైనేజీ మ్యాన్‌హోల్ నుంచి డ్రైనేజీ పొంగిపోవడంతో మురుగు రోడ్లపై పారుతోంది. స్థానిక ప్రజా ప్రతినిధులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలి. – మల్గిరెడ్డి కొండల్‌రెడ్డి, కాలనీ ప్రధాన కార్యదర్శి

అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు..



పిండినారాయణరెడ్డి కాలనీలో గత కొద్ది నెలలుగా డ్రైనేజీ పొంగి పొర్లుతూ.. రోడ్లపై దుర్గంధం వెదజల్లుతోంది. ఈ సమస్యను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి. – కె.లక్ష్మీనర్సింహ్మారెడ్డి, కాలనీ కోశాధికారి

పరామర్శ

వనస్థలిపురం: హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని భూలక్ష్మీనగర్ నివాసుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల మాధవరెడ్డిని సోమవారం మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మన్ సునీతమహేందర్‌రెడ్డి తదితరులు పరామర్శించారు. మాధవరెడ్డి ముక్కు ఎముకకు సర్జరీ చేయించుకుని ఇంటికి చేరుకున్న సందర్భంగా వారు ఆయనను కలసి పరామర్శించారు. కాగా పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వివిధ పార్టీల నాయకులు వ్యక్తిగతంగా కలిసి పరామర్శించారు.

కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రెడ్డి



మన్సూరాబాద్: కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా మన్సూరాబాద్‌కు చెందిన జాలె వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహ్మారెడ్డి జారీ చేసిన ఉత్తర్వులను టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి సోమవారం వెంకట్‌రెడ్డికి అందజేశారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం అందిస్తున్న గ్యారంటీలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా ప్రయత్నిస్తానని, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. సహకరించిన టీపీసీసీ ప్రతినిధి, కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరలు కిలో..రూలల్లో.. టమాటా లోకల్ రూ.11, వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 65, కాకరకాయ 45, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 25, క్యారెట్ 28. దొండకాయ 28, ఆలుగడ్డ 25, ఉల్లిగడ్డ 24, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.18, అరటి 10, చిక్కుడు 60, అర్వి 50, మునగ 45, చిలగడదుంప 65, బీట్‌రూట్ 23, కీర 23, ఫ్రెంచ్ బీన్స్ 55, కాప్సికమ్ 60గా ఉన్నాయి. ఈ ధరలు మంగళవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అలీ మస్కతిని కలిసిన ఎన్ఎస్‌యూఐ నేతలు



అలీ మస్కతిని సన్మానిస్తున్న ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోహేల్

మలక్‌పేట: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ సోహెల్‌ఉద్దీన్ సోమవారం విద్యార్థి నాయకులతో కలిసి కాంగ్రెస్ పార్టీ నేత అలీ మస్కతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో హైదరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని సూచించినట్లు సోహేల్ తెలిపారు. నాయకులు ముజీబ్, ఫైజల్, ప్రణయ్, అమీర్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానించిన మహిళలతో గౌడ సంఘం సభ్యులు

మహిళలకు సన్మానం

లింగోజిగూడ: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రభుత్వం అందజేసిన చేయూతను అందిపుచ్చుకోవాలని ఎల్‌బీనగర్, సరూర్‌నగర్ సర్కిల్ డీసీలు జాకీయా సుల్తానా, సుజాతలు పేర్కొన్నారు. ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా సరూర్‌నగర్ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం లింగోజిగూడ సంఘం భవనంలో డీసీలతో పాటు మహిళా పోలీస్‌స్టేషన్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సుమారు 80 మంది మహిళలను సన్మానించారు. ఈ సందర్భంగా సంఘం ప్రధాన కార్యదర్శి కందికంటి శ్రీధర్‌గౌడ్ మాట్లాడుతూ.. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత మనపై ఉందని, మహిళలకు అండగా ఉండి ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. సంఘం సభ్యులు కాకి మహేందర్‌గౌడ్, రాజ్‌కుమార్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, రాంమోహన్‌గౌడ్, సత్యనారాయణ, నర్సింగ్‌రావు, ఈశ్వర్‌గౌడ్ తదితరులున్నారు.

వినతిపత్రం అందజేత



బండ్లగూడ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నాగోలు: నాగోలు చౌరస్తా నుంచి కుంట్లూర్ మీదుగా పెద్ద అంబర్‌పేట వరకు బస్సు సర్వీసులను కొత్తరూట్లలో ప్రయాణికుల అవసరాల కోసం నడపాలని బీజేపీ నేతలు చరణ్‌రెడ్డి, ఇతర కాలనీవాసులు బండ్లగూడ డిపో మేనేజర్‌కు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చరణ్ రెడ్డి మాట్లాడుతూ.. బండ్లగూడ డిపో నుంచి కొత్తగా నాగోలు, బండ్లగూడ, అన్నారం, కుంట్లూర్ మీదగా పెద్దఅంబర్‌పేట, హయత్‌నగర్ వరకు కొత్తరూట్లలో ప్రయాణికుల అవసరాల కోసం బస్సు నడపాలని కోరారు. నగరు శివారు ప్రాంతంలోని ఇంజినీరింగ్, ఇతర కాలేజీలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ పనుల మీద నగరంలోకి వెళ్లి తిరిగొచ్చి నాగోల్‌లో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కొత్త రూట్లలో బస్సు సర్వీసులును నడపాలని కోరారు.

'రన్‌ఫర్ జీసెస్'ను విజయవంతం చేయండి



ప్రార్థనలు చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవ సంఘు నాయకులు

మలక్‌పేట: మలక్‌పేట నియోజకవర్గ పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సలీంనగర్ చర్చి ఆఫ్ గాడ్ మందిరంలో పాస్టర్స్ ఫెలోషిప్ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి సీనియర్ పాస్టర్ రెవరెండ్ మెన్నోజోయల్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి పాస్టర్లు యేసురత్నం, పీఎస్‌జే క్రిస్టోఫర్ హాజరై బైబిల్ సందేశం అందించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోల అబ్రాహం మాణిక్యం మాట్లాడుతూ.. గుడ్ ఫ్రైడే సందర్భంగా ఈనెల 29న తలపెట్టిన రన్ ఫర్ జీసెస్, 31న ఆదివారం ఈస్టర్ సన్‌రైజ్ సర్వీస్ విజయవంతం చేయాలని కోరారు. పాస్టర్ డాక్టర్ సాల్మన్ జోబ్స్, క్రైస్తవ సంఘాల నేతలు జేబీ. జయరాజ్, డేవిడ్, మోజెస్, ఆర్డీసీ సామేల్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలను తొలగించండి



పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో వేసిన భవన నిర్మాణ వ్యర్థాలు

మన్సూరాబాద్: పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు వేసి చదును చేసి నిర్మాణాలకు యత్నిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హయత్‌నగర్ మండలం సాహెబ్‌నగర్ కుర్దు పెద్దచెరువు ఎఫ్‌టీఎల్ స్థలంలో గత కొంతకాలంగా గంగిరెద్దుల వాళ్లు తాత్కాలికంగా గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారు. కబ్జాదారులు రెవెన్యూ అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి వారిని ఖాళీ చేయించారని వినికిడి. రాత్రి సమయంలో ఈ ప్రాంతంలోకి టిప్పర్ల సాయంతో భవన నిర్మాణ వ్యర్థాలను నింపి చదును చేశారు. దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి ఎఫ్‌టీఎల్ స్థలంలో భవన నిర్మాణ వ్యర్థాలను నింపుతున్న వారిని గుర్తించి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

సంతోష్‌నగర్: ఎన్నికల సందర్భంగా ప్రజలకు భరోసా కల్పించేందుకు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహిస్తున్నామని చాంద్రాయణగుట్ట ఏసీపీ మనోజ్ కుమార్ అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని హఫీజ్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్‌ను నిర్వహించారు. ఏసీపీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ..రానున్న పార్లమెంటు ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు నాయకులు, ప్రజలు పోలీసులకు పూర్తిగా సహాయ సహకారాలు అందించాలన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి



మహిళా దినోత్సవ వేడుకల్లో కార్పొరేటర్ అరుణ సురేంద్రనాథ్

నాగోలు: సమాజంలో మహిళలు ఆత్మగౌరవం, స్వశక్తితో ఎదగాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేంద్రనాథ్‌యాదవ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సం సందర్భంగా సోమవారం నాగోలు డివిజన్‌లో సహభవన టౌన్‌షిప్ సీ-బ్లాక్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. దేశంలో మహిళలు విద్య, వైద్యం, వ్యాపారాలు, రాజకీయాలు, క్రీడలు, బ్యాంకింగ్, అంతరిక్షం, టెక్నాలజీ వంటి పలురంగాల్లో మహిళలు రాణిస్తూ.. మహిళా సాధికారత సాధన దిశగా అడుగులు వేస్తున్నారన్నారు. దేశంలో మహిళలు మానవ వనరుల సంపూర్ణ వినియోగంలో కూడా వీరిపాత్ర కీలకమన్నారు. సహభావన టౌన్‌షిప్ సీ–బ్లాక్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో కాలనీలు

పట్టించుకోని సంబంధిత అధికారులు

నాగోలు: నాగోల్ డివిజన్‌లోని అనంతుల జంగారెడ్డి కాలనీలో గత మూడు నెలలుగా విద్యుత్ దీపాలు వెలగకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ దీపాల మరమ్మతుల కారణంగా జీహెచ్ఎంసీలో అనే ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు చేసినా స్పందించడం లేదని చెబుతున్నారు. విద్యుత్ మరమ్మతు కాంట్రాక్టర్ల వర్కర్లు స్ట్రైక్‌లో ఉన్నారని డిపార్ట్‌మెంట్‌లో మెయింటెనెన్స్ మరమ్మతుల నిమిత్తం పరికరాలు లేవని కాలయాపన చేస్తున్నారని కాలనీవాసులు పేర్కొన్నారు. దీనిపై ప్రజాప్రతినిధులకు చెప్పిన వారు సైతం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ పైస్థాయి అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

వ్యర్థాలను తొలగించండి..



అరోరా కాలేజ్ ఎదురుగా రోడ్డుపై ఇలా..

మలక్‌పేట: మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్‌లలో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కాలనీల్లో చెత్తకుప్పలు పేరుకుపోయి కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ అధికారుల పర్యవేక్షణ కొరవడి సమస్యలు తలెత్తున్నాయి. కాలనీ కూడళ్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం లేదు. చెత్తకుప్పల తొలగింపునకు ప్రత్యేక వాహనం కేటాయించిన కొన్ని ప్రాంతాల్లో చెత్త తరలించి చేతులు దులుపుకుంటున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాదచారులు నడవడటానికి ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌లు చెత్త చెదారంతో నిండిపోతున్నాయి. అరోరా కాలేజ్ ఎదురుగా చెత్త కుప్పలుగా ఉంటుందని, ఈస్ట్ ప్రశాంత్‌నగర్ ఫుట్‌పాత్‌లపై ఉన్న చెత్తను తొలగించడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. చెత్త చెదారం పేరుకుపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నడకతో ఆరోగ్యానికి మేలు

హుడాకాంప్లెక్స్: నడక ఆరోగ్యానికి ఎంతో మంచిదని, ప్రతి ఒక్కరూ నడుస్తూ తోటి వారిని నడిపించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ గవర్నర్ శ్రీనివాసచారి అన్నారు. క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ కార్యక్రమాన్ని హుడాకాంప్లెక్స్‌లోని సీనియర్ సిటిజన్స్ భవనంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకర్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా దాచేపల్లి శ్రీనివాస్‌గుప్తా, ప్రధాన కార్యదర్శిగా చోలేటి ఆనంద్, కోశాధికారిగా నరసింహను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా గవర్నర్ శ్రీనివాసచారి.. మాట్లాడుతూ వాకర్స్ క్లబ్ ఆఫ్ గ్రేటర్ దిల్‌సుఖ్‌నగర్ ఆధ్వర్యంలో మంచి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో శివప్రసాద్, చక్రపాణి, లింగప్రకాశ్, మాధవరావు, సంపత్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, గౌరీశంకర్, శ్రీనివాసచారి, మురళీకృష్ణ పాల్గొన్నారు.

తాగునీటి సరఫరాకు వినతి

బడంగ్‌పేట్: తాగునీటిని రోజు విడిచి రోజు విడుదల చేయాలని కోరుతూ.. సోమవారం వినాయకహిల్స్ కాలనీవాసులు అధికారులకు విన్నవించారు. బడంగ్‌పేట కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని 5వ డివిజన్ కార్పొరేటర్ దీపిక శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అధికారులను కలిశారు. వినాయకహిల్స్ కాలనీలో ఐదు రోజులకోసారి తాగునీటిని విడుదల చేస్తుండటంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఉన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని బాలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం గ్లోబల్ చాంపియన్స్, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతను పురస్కరించుకుని పలు కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా పాఠశాలకు గ్రామాల నుంచి నడుచుకుంటూ వస్తున్న విద్యార్థినీలను గుర్తించి సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా సైకిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ కోశాధికారి శ్రీనివాస్, ప్రతినిధి డాక్టర్ కర్ణ మాట్లాడుతూ.. అన్ని విధాలా పాఠశాలకు సహకారం అందిస్తామన్నారు. అంకితభావంతో గుణాత్మక విద్యాను అందిస్తున్న గురువులను అర్థం చేసుకుని, వారి జ్ఞానాన్ని అందిపుచ్చుకుని ర్యాంకుల వేటలో పడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ కిరణ్, ప్రధానోపాధ్యాయుడు రామాంజన్, చైతన్యకుమార్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

సుల్తాన్‌బజార్: మహిళలు అన్నిరంగాల్లో రాణిస్తేనే దేశం అభివృద్ధి పథకంలో పయనిస్తుందని హైకోర్టు జడ్జి జి.రాధారాణి పేర్కొన్నారు. ఉమర్ అలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్, జీవనది ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథులుగా జస్టిస్ రాధారాణి హాజరై పలు రంగాల్లోని మహిళలను ఘనంగా సత్కరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలను లింగ వివక్షకు గురికాకుండా అన్నింటిలోనూ సమాన అవకాశాలు కల్పించాలన్నారు. రాజకీయ రంగంలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐపీఎస్ అధికారి రాజేశ్వరీ, దాసరి ప్రసన్న, వేమూరి లక్ష్మీకాంత్, సీతా మహాలక్ష్మి, దుర్గ, కె.లక్ష్మి, మాధవి తదితరులు పాల్గొన్నారు.